క్లుప్తంగా

ఆదిత్యుడ్ని దర్శించుకున్న నూతన ఏఎస్పీ



ఏఎస్పీకి జ్ఞాపికను అందజేస్తున్న చక్రవర్తి

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారిని ఏఎస్పీగా (క్రైం) నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఉమామహేశ్వరరావు సోమవారం దర్శించుకున్నారు. ఈయనకు ఆలయ అధికారులు బి.ఎస్.చక్రవర్తి తదితరులు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. స్వామివారి జ్ఞాపికను అందజేశారు. ఈనెల 16న జరిగే రథసప్తమి ఉత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో వన్‌టౌన్ ఎస్సై బలివాడ గణేష్ తదితరులున్నారు.

బాలల రక్షణపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న సాయికుమార్

రణస్థలం: బాల్య వివాహాల నిర్మూలన, బడి బయట ఉన్న బాలలపై ప్రత్యేక దృష్టి సారించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పిన్నింటి సాయికుమార్ అన్నారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి బాలల రక్షణ, పర్యవేక్షణ, బాల్య వివాహ నిరోధక కమిటీని ఏర్పాటు చేశారు. మండల కమిటీ చైర్‌పర్సన్‌గా ఎంపీపీ పిన్నింటి రజిని, కన్వీనర్‌గా సీడీపీవో ఝాన్సీ, సోషల్ వర్కర్స్‌గా ఐ.జనార్దన, ఎ.గీత ఉన్నారు. ఈ సందర్భంగా బాల్య వివాహాలు నిర్మూలన విధి విధానాలు, బాధ్యతలపై చర్చించారు. ఎంపీడీఓ ఆర్.వి రమణమూర్తి, ఏఓ ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 4న ఆలయ పునఃప్రతిష్ట



త్రిదండి చినజీయర్ స్వామితో ఆలయ ట్రస్ట్ సభ్యులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఫరీదుపేటలోని రంగనాథ స్వామి ఆలయ పునఃప్రతిష్టకు త్రిదండి చినజీయర్ స్వామి ముహూర్తం కట్టారు. ఏప్రిల్ 4వ తేదీని ముహూర్తం ఖరారు చేశారు. తెలంగాణ రాష్ట్రం ముచ్చింతల్ ఆశ్రమంలో స్వామివారిని ఆలయ ట్రస్ట్ సభ్యులు సీఐ పైడి రంగనాథం, పైడి ముఖలింగం, సూర శ్యామలరావు తదితరులు సోమవారం కలిశారు. ప్రస్తుతం నూతన ఆలయ నిర్మాణం చివరి దశలో ఉంది. పునఃప్రతిష్టకు ట్రస్ట్ సభ్యులు ఏర్పాట్లు ముమ్మరం చేశారు.

వైభవంగా ప్రతిష్ఠా మహోత్సవం

గార: శ్వేతగిరిపై నూతనముగా నిర్మించిన వీరవసంతేశ్వర దేవాలయాల ప్రతిష్ఠామహోత్సవము సోమవారం ఉదయం వైభవంగా ప్రారంభించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త మహేంద్రాడ రవికుమార్ శర్మ దంపతులు విఘ్నేశ్వర పూజతో మహోత్సవాలను ఆరంభించారు. సుసరాపు చంద్రశేఖర శర్మ, వేద పండితులు ముందుగా పుణ్యాహవచనం, పరిషత్ కృచ్ఛ్రత్రయం, పంచగవ్యం, దీక్షా, రక్షాధారణ, యాగశాల ప్రవేశం, మండల మండప ఆవాహనములు జరిపించారు. అనంతరం విగ్రహాలను జలాదివాసం, క్షీరాధివాసంలు శాస్త్రోత్తకంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ ప్రాంగణంలో మధ్యాహ్నం ద్విగ శాష్టావధానం చేశారు. కార్యక్రమంలో బంకుపల్లె రమేశ్ శర్మ, సుసరాపు చంద్రశేఖర శర్మ, రంప సాయికుమార్ శర్మ పాల్గొన్నారు.

మల్లికార్జున స్వామి తలపాగా తిరువీధి



తలపాగాను తిరువీధి నిర్వహిస్తున్న భక్తులు


ఎచ్చెర్ల: మహా శివరాత్రి ఉత్సవాలు పురస్కరించుకుని శ్రీశైల మల్లికార్జున స్వామివారి కోసం లావేరు పెద్దవీధికి చెందిన కాశిన వెంకటరమణ బ్రదర్స్ తయారుచేసిన తలపాగాను సోమవారం తిరువీధి నిర్వహించారు. ఆనందాశ్రమ శ్రీనివాసనంద స్వామిజీ హాజరయ్యారు. ఈ తలపాగాకు నరసన్నపేట, బుడితి, పొందూరు, రాజాం, శ్రీకాకుళం, విజయనగరం, తదితర ప్రాంతాల్లో పూజా కార్యక్రమాలు నిర్వహించి, అనంతరం తిరువీధి చేపట్టనున్నట్లు కాశిన వెంకటరమణ బ్రదర్స్ తెలిపారు. రాజమండ్రి, విజయవాడ, మంగళగిరి, గుంటూరుకు కూడా ఈ తలపాగాను తీసుకువెళ్తామన్నారు. భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

16న ఆనంద్ జయంత్యుత్సవం

శ్రీకాకుళం కల్చరల్: జిల్లాకు చెందిన ప్రముఖ సినీ నేపథ్య గాయకుడు దివంగత జి.ఆనంద్ జయంతోత్సవాన్ని ఈనెల 16న నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు జి.బాలరాజు, జి.వీర్రాజులు తెలిపారు. బాపూజీ కళామందిర్‌లో సాయంత్రం 5.30 గంటలకు ప్రారంభం కానున్న కార్యక్రమానికి మంత్రి ధర్మాన ప్రసాదరావు ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు.

ఆ'వే'దన తీరింది..

- సుందరంగా కొర్ని–కొమరవానిపేట రోడ్డు
- రూ. 1.30 కోట్లతో అభివృద్ధి



సుందరంగా ఉన్న సీఎస్పీ రోడ్డు నుంచి కొమరవానిపేట రోడ్డు (నేడు)



సీఎస్పీ రోడ్డు నుంచి కొమరవానిపేటకు వెళ్లే రోడ్డు గోతులమయంగా ఉన్న దృశ్యం (నాడు)

గార: గత ప్రభుత్వం గ్రామీణ రోడ్లపై నిర్లక్ష్యంగా వ్యవహరించింది. దీంతో ప్రజలు రాకపోకలకు అనేక ఇబ్బందులు పడేవారు. అయితే వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రోడ్లకు మహర్దశ పట్టింది. శ్రీకాకుళం–పాలకొండ రోడ్డు నుంచి కొర్ని, కొర్లాం మీదుగా తీరప్రాంత గ్రామమైన కొమరవానిపేట వరకు ఉన్న బీటీ రోడ్డు గతంలో గోతులమయంగా మారింది. వేసవికాలంలో రోడ్డుపైన గుంతలు కనిపించినప్పుడు వాహనదారులు చాలా ఇబ్బందులు పడేవారు. ఈ రోడ్డుపై మొగదాలపాడు పర్యాటక ప్రాంతానికి చేరుకోవచ్చు. అంతేకాక చేపలు తీసుకెళ్లే వాహనాకు సైతం ఈ రోడ్డు ఉపయోగకరంగా ఉంటుంది. ఎంతో ప్రాధాన్యం ఉన్న ఈ రోడ్డును టీడీపీ సర్కార్ విస్మరించింది. అధ్వానంగా ఉన్న రోడ్డు విషయాన్ని స్థానిక ప్రజాప్రతినిధులు రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే స్పందించిన ఆయన అధికారులతో చర్చించి అంచనాలు రూపొందించి నిధులు విడుదలయ్యేలా చేశారు. రూ. ఒక కోటి 30 లక్షలతో పనులు పూర్తి చేశారు. దీంతో రహదారి కష్టాలు తీరాయని కొర్ని, కొర్లాం, కొమరవానిపేట, మొగదాలపాడు గ్రామస్తులు, పర్యాటకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సమ్మెకు బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల మద్దతు

- సమావేశంలో తీర్మానం



సమావేశంలో యూనియన్ ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: ఈనెల 16వ తేదీన జరగనున్న దేశవ్యాప్త సమ్మెలో తమ ఉద్యోగులు భాగస్వాములు కావాలని బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యవర్గం ఏకగ్రీవంగా తీర్మానించింది. యూనియన్ జిల్లా కార్యవర్గ సమావేశం సంఘ కార్యాలయంలో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఈయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాతల గోవర్ధనరావు, పోలాకి వెంకటరావులు మాట్లాడుతూ.. ప్రభుత్వరంగ సంస్థ అయిన బీఎస్ఎన్ఎల్ పరిరక్షణ కోసం సమ్మెలో పాల్గొనాలన్నారు. అక్రమ బదిలీలను ఎత్తివేయాలని, పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈయూ నాయకులు కిరణ్, హెచ్.మల్లేసు, ఎస్.అభిమన్యు, డి.శ్రీనివాసరావు, భాను, రామారావు, చరణ్, ఏఐబీడీపీఏ నాయకులు జగన్నాయకులు, హెచ్.డిల్లేశ్వరరావు ఉన్నారు.

ఫ్లై ఓవర్ నిర్మించవద్దని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కమిటీ సభ్యులు

రణస్థలం: మండల కేంద్రంలోని జాతీయ రహదారిలో ఫ్లై ఓవర్ నిర్మాణ ప్రతిపాదనను గ్రామస్తులందరూ వ్యతిరేకిస్తున్నారు. తహసీల్దార్ ఎల్.రామారావుకు రణస్థలం ఫ్లైఓవర్ వ్యతిరేఖ కమిటీ సభ్యులు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ 2002లో రహదారి విస్తరణ సమయంలో గ్రామస్తులు ఆర్థికంగా నష్టపోయామన్నారు. ఇప్పుడిప్పుడే కొలుకుంటున్నారని, మరలా ఫ్లై ఓవర్ నిర్మాణం పేరుతో చేస్తున్న సర్వేలో వందలాది నివాసాలు, దుకాణాలు కనుమరుగయ్యేలా మార్కింగ్ వేసి ఆందోళనకు గురిచేస్తున్నారు. జే.ఆర్.పురం పంచాయతీలోని దన్నానపేట పెట్రోల్ బంక్ నుంచి రావివలస చివరి వరకు సుమారు నాలుగు కిలో మీటర్లు స్తంభాలతో కూడిన ఫ్లైఓవర్ నిర్మాణానికి గ్రామస్తులు సుముఖంగా లేరని వివరించారు. ఈ ఫ్లై ఓవర్ వల్ల రణస్థలం అభివృద్ధి నిలిచిపోతుందని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో వైస్ ఎంపీపీ రాయపురెడ్డి భుజంగరావు, జే.ఆర్.పురం సర్పంచ్ బవిరి రమణ, ఎంపీటీసీ సభ్యుడు పచ్చిగుళ్ల సాయిరాం, మాజీ ఎంపీపీ డీజీఎం ఆనందరావు, కమిటీ సభ్యులు ఇ.తిరుపతిరాజు, పిన్నింటి సత్యంనాయుడు, అల్లు యుగంధర్, డి.రామరావు, టీకే బ్రహ్మాజీ, మీసాల బంగారు నాయుడు తదితరులు ఉన్నారు.

ఉపాధి టీఏ మృతికి సంతాపం



వెంకటరాజు (ఫైల్)

గార: మండల ఉపాధి హామీ పథకంలో టెక్నికల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న టి.వెంకటరాజు సోమవారం వేకువజామున గుండెపోటుతో మరణించారు. శ్రీకాకుళం జెడ్పీ కార్యాలయం సమీపంలో అద్దె ఇంట్లో ఉంటున్న ఈయన సౌమ్యునిగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఈయన మృతికి పలువురు సంతాపం తెలియజేశారు. వెంకటరాజు మృతదేహానికి ఎంపీపీ గొండు రఘురామ్, ఏపీవో సంధ్యారాణి, టెక్నికల్, ఫీల్డు అసిస్టెంట్లు నివాళులర్పించారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయం

జి.సిగడాం: స్థానిక తహసీల్దార్, ఎంపీడీఓ, ఐకేపీ కార్యాలయాల ఆవరణంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగుచేసిన కూరగాయలను సోమవారం విక్రయించారు, సేంద్రియ ఎరువుల ద్వారా అధిక దిగుబడులతోపాటు ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుందని పకృతి వ్యవసాయ సిబ్బంది తెలిపారు.

జవాన్ కుటుంబానికి పరామర్శ



జవాన్ కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న రామ్‌మనోహర్‌నాయుడు

గార: శిమ్మపేట గ్రామానికి చెందిన పారా మిలటరీ జవాన్ దుంగ రాంబాబు ఇటీవల మృతి చెందారు. దీంతో వారి కుటుంబసభ్యులను వైఎస్సార్‌సీపీ యువ నాయకులు ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు సోమవారం సాయంత్రం పరామర్శించారు. రాంబాబు చిత్రపటానికి నివాళులర్పించారు. కారణాలు అడిగి తెలుసుకుని ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులతో అన్నారు. అదే విధంగా మండల మహిళా నాయకురాలు అంబటి అంబిక శస్త్ర చికిత్స జరగడంతో ఆమెను కూడా పరామర్శించారు. కార్యక్రమంలో అంబటి రంగారావు, గొలివి కొండలరావు, శీర సత్యం మాస్టారు, శీర ప్రభాకరరావు, శిమ్మ ఆదినారాయణ ఉన్నారు.

25న అంబేడ్కర్ సామాజిక భవనానికి శంకుస్థాపన



సమావేశంలో పాల్గొన్న అంబేడ్కర్ సామాజిక భవన కమిటీ సభ్యులు

రణస్థలం: కొండములగాం పంచాయతీ ముక్తుంపురం పరిధిలో అంబేడ్కర్ సామాజిక భవన నిర్మాణానికి ఈ నెల 25వ తేదీన శంకుస్థాపన, భారీ బహిరంగ సభ నిర్వహించనునట్లు భవన నిర్మాణ కమిటీ అధ్యక్షుడు దువ్వాన అప్పలసూరి తెలిపారు. గ్రామంలో అంబేడ్కర్ భవన నిర్మాణ స్థలంలో కమిటీ సభ్యులు సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దళితులు, బడుగు, బలహీన వర్గాలు, అంబేడ్కర్ వాదులు, విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులు, కర్షకులందరూ హాజరై జయప్రదం చేయాలని కోరారు. కమిటీ సభ్యులు సింక అప్పారావు, నేతల కృష్ణ, దండాసి జాన్, సత్యప్రసాద్, నేతల సురేష్, యామల కృష్ణ, బోమ్మలాట శ్రీరామ్, లింగాల ఈశ్వరరావు, బుడుమూరు యల్లారావు, తోట ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయం ప్రారంభం



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ సూర్యారావు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎస్ఎంపురం గ్రామంలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.40 లక్షలతో నిర్మాణం చేపట్టిన గ్రామ సచివాలయ భవనాన్ని సర్పంచ్ కొన సూర్యారావు సోమవారం ప్రారంభించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నామన్నారు. ఎంపీటీసీలు కింతలి ఈశ్వరరావు, కూన ఈశ్వరమ్మ, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ కేవీవీ సత్యనారాయణ, నాయకులు జరుగుళ్ల అటకేశ్వరరావు, కూన అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

శంకరరావుపై దాడికి నిరసనగా ర్యాలీ



ఏడు రోడ్ల కూడలి వద్ద ర్యాలీ చేస్తున్న శంకరరావు మద్దతుదారులు

శ్రీకాకుళం క్రైమ్: ఎచ్చెర్లకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు జరుగుళ్ల శంకరరావుపై ఈనెల తొమ్మిదో తేదీన గుర్తు తెలియని దుండగులు చేసిన దాడికి నిరసనగా సోమవారం శ్రీకాకుళం నగరంలో ఆయన మద్దతుదారులు ర్యాలీ నిర్వహించారు. నగరంలోని ఏడు రోడ్ల కూడలి నుంచి డేఅండ్‌నైట్ జంక్షన్ వరకు ర్యాలీ జరిగింది. ఎచ్చెర్లలోనూ స్వచ్ఛందంగా దకాణాలు బంద్ చేస్తూ మద్దతుదారులు ర్యాలీ చేపట్టారు. హత్యా రాజకీయాలను అరికట్టాలి, దోషులను శిక్షించాలని, శంకరన్నకు న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. అనంతరం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో శంకరరావు భార్య విజయకుమారి తన అనుచరులతో కలిసి అదనపు ఎస్పీకి తన భర్తపై హత్యాయత్నానికి పాల్పడిన దోషులను శిక్షించాలంటూ వినతిపత్రం అందించారు. గతంలో కూడా సెప్టిక్‌ట్యాంక్‌తో తన భర్త కారును గుద్దించి హత్యాయత్నానికి పాల్పడ్డారని అదనపు ఎస్పీ ప్రేమ్‌కాజల్‌కు వివరించారు.

16న అరసవల్లిలో రక్తదాన శిబిరం

శ్రీకాకుళం: మానవ సేవే మాధవ సేవ అనే నినాదంతో నడక సంఘాలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నాయని వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు జి.ఇందిరా ప్రసాద్. బి.వి.శంకర్, ఎస్.జోగినాయుడు అన్నారు. సోమవారం స్థానిక విలేకరుతో మాట్లాడుతూ.. రథసప్తమి సందర్భంగా ఈ నెల 16వ తేదీన అరసవల్లి శ్రీధర్మశాస్త్ర సన్నిధానంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. వాకర్స్ క్లబ్ ప్రతినిధులతో గోడ పత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బి.దేవిప్రసాద్, సంతోష్, లక్ష్మి, జగ్గారావు, ధనుంజయబట్లు, కృష్ణారావు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలతో జీవితాలు నాశనం


ఎచ్చెర్ల: చెడు వ్యసనాలతో జీవితాలు నాశనమవుతాయని ఎక్సైజ్ సీఐ గోపాలకృష్ణ తెలిపారు. అల్లినగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాదకద్రవ్యాల వాడకం వల్ల కలిగినే నష్టాలపై విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. ఎక్సైజ్ ఎస్సై ఎల్.మాధవి, హెచ్ఎం పార్థసారధి, పాఠశాల సిబ్బంది రేణుకాదేవి, నరసింహామూర్తి, పీడీ జగదీష్ పాల్గొన్నారు.

కంచరానకు జనరంజక కవి పురస్కారం



శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం పట్టణానికి చెందిన కంచరాన భుజంగరావు జనరంజక కవి ప్రతిభా పురస్కారానికి ఎంపికయ్యారు. గుంటూరు రావి రంగారావు సాహిత్య పీఠం గత ఎనిమిదేళ్లుగా నిర్వహిస్తున్న జనరంజక కవి ప్రతిభా పురస్కారాలు 2023 ఫలితాలు పీఠం అధ్యక్షుడు ఎస్.ప్రభావత్ ప్రకటించారని భుజంగరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. తాను రచించిన నీటి గింజల పంట (వచన కవితలు)కి ఎంపికైనట్లు తెలిపారు. ఈ పురస్కారాన్ని ఈ నెల 14న గుంటూరులోని బృందావన్ గార్డెన్స్‌లో జరగనున్న కార్యక్రమంలో ప్రదానం చేస్తారన్నారు.

నేత్ర శస్త్ర చికిత్సలకు 17 మంది ఎంపిక



శస్త్ర చికిత్సల కోసం తరలిస్తున్న సిబ్బంది

రణస్థలం: మండల కేంద్రంలోని కల్యాణి ఆస్పత్రిలో పలువురి కంటి పరీక్షలు నిర్వహించి, అందులో 17 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేసినట్లు వైద్యాధికారి ఎస్.కళ్యాణి సోమవారం తెలిపారు. శ్రీకాకుళం శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రికి తరలించామన్నారు. వీరందరికి వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా చికిత్స చేసి మందులు అందిస్తారన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ట



పునఃప్రతిష్ట కార్యక్రమాలు నిర్వహిస్తున్న దృశ్యం

జి.సిగడాం: సంతవురిటిలో గల వేణుగోపాలరావు ఆలయం పునఃప్రతిష్ట మహోత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రతిష్ట ఉత్సవాలు ఆలయ ధర్మకర్త బాలబొమ్మ శ్రీనివాసరావు, గ్రామస్తుల సమక్షంలో చేపట్టారు. ఈ నెల 14న స్వామివారి శాంతి కల్యాణంతోపాటు భారీ అన్నసమారాధన ఉంటుందని గ్రామస్తులు తెలిపారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



బహుమతులు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఎచ్చెర్ల: నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన ఆడుదాం–ఆంధ్ర ఆటల పోటీల్లో లావేరు మండలంలోని విజేతలకు సోమవారం లావేరు మండల పరిషత్ కార్యాలయంలో మండల ప్రత్యేక ఆహ్వానితుడు రొక్కం బాలకృష్ణ, జెడ్పీటీసీ సభ్యుడు మీసాల సీతంనాయుడు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ క్రీడలతో శారీరక ధారుడ్యంతో పాటు, మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. బ్యాడ్మింటన్ మహిళల విభాగంలో వెంకటాపురం క్రీడాకారులకు, బ్యాడ్మింటన్ పురుషుల విభాగంతో లావేరు క్రీడాకారులకు బహుమతులు అందించారు. క్రికెట్‌లో మురపాక క్రీడాకారులకు, కబడ్డీలో బెజ్జిపురం క్రీడాకారులకు, వాలీబాల్‌లో వెంకటాపురం క్రీడాకారుకుల, ఖోఖో క్రీడలో బెజ్జిపురం క్రీడాకారులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ భాస్కరరావు, ఈఓపీఆర్డీ ప్రభాకరరావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మీసాల శ్రీను, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా సహస్ర కలశస్నపనం



కలశస్నపన పూజలో ఈవో రమేష్‌బాబు, శంకరశర్మ



అనివెట్టి మండపంలో సహస్ర కలశాలు

అరసవల్లి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారి సన్నిధిలో సహస్ర కలశస్నపనం కార్యక్రమం శాస్త్రోక్తంగా వేదమంత్రోచ్ఛరణల నడుమ ఘనంగా సోమవారం ఉదయం జరిగింది. అనివేటి మండపంలో ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో అర్చక బృందం వేదమంత్రోచ్ఛారణలతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రారంభ పూజలో ఆలయ ఈవో డి.ఎల్.వి.రమేష్‌బాబు పాల్గొనగా.. పలువురు ఆలయ దాతలు సహస్రకలశాస్నపన కార్యక్రమాన్ని తిలకించారు. ఈసందర్భంగా ప్రధానార్చకులు శంకరశర్మ మాట్లాడుతూ.. మంగళవారం వేకువజామున కుంభసంక్రమణం సందర్భంగా ఆదిత్యుని మూలవిరాట్టుకు పంచామృతాలతో అభిషేక సేవ చేస్తున్న నేపథ్యంలో సహస్ర కలశస్నపన కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు.

కథా నిలయంపై పరిశోధన పత్రం



పరిశోధన పత్రం సమర్పిస్తున్న ఉమాకవి

శ్రీకాకుళం కల్చరల్: జాతీయ 129వ శతాధిక కవి సమ్మేళనం, జాతీయ సాహితీ సదస్సులో పట్టణానికి చెందిన శ్రీకాకుళం సాహితీ చైతన్య కిరణాలు, బాల కథానిలయం వ్యవస్థాపకులు డాక్టర్ బోగెల ఉమామహేశ్వరరావు (ఉమాకవి) కథా నిలయంపై పరిశోధన పత్రం సమర్పించారు. ఈ విషయాన్ని ఆయన సోమవారం తెలిపారు. కొయ్యల గూడెంలో శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో జరిగిన కవి సమ్మేళనలో కథా నిలయం వ్యవస్థాపకులు కాళీపట్నం రామారావు తెలుగు సాహిత్యంలో చేసిన కృషిపై పరిశోధన పత్రం సమర్పించారన్నారు. కార్యక్రమంలో శ్రీశ్రీ కళావేదిక చైర్మన్ కత్తిమండ ప్రతాప్, సమన్వయకర్త కొల్లి రమాపతి, ఆర్గనైజింగ్ కార్యదర్శి డాక్టర్ టి.పార్థసారధి పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే సీఎం జగన్ ధ్యేయం



మాట్లాడుతున్న వెంకటిసాయి

జి.సిగడాం: రైతుల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అనేక పథకాలు అమలు చేశారని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ముక్క వెంకటిసాయి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో అగ్రికల్చర్ అసిస్టెంట్లతో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖరీఫ్‌లో పండించిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేసి, సకాలంలో రైతుల ఖాతాల్లో నగదు జమ చేసిందన్నారు. రబీలో సాగు చేసిన వివిధ రకాల పంటలకు ఈ– క్రాప్ నమోదు చేయాలన్నారు. ఎరువులు, విత్తనాలు ఒకేసారి భూమిలో పడేలా యంత్రాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. ఏఓ శారద తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ జాబితా కూర్పుపై కలెక్టర్ అసంతృప్తి

ఎచ్చెర్ల క్యాంపస్: ఎస్.ఎం.పురం పంచాయతీ పరిధిలోని పోలీస్ క్వార్టర్స్ పోలింగ్ స్టేషన్–254 ఓటర్ జాబితా కూర్పుపై కలెక్టర్ మనజీర్ జిలాని సమూన్ అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించి సీరియస్ అయ్యారు. ప్రస్తుతం పోలీస్ కార్టర్స్ శిథిల భవనాల్లో ఎవరూ నివాసాలు లేరు. ఇదే చిరునామాతో ఓటర్లు ఉన్నారు. ఈ ఓటర్లపై విచారణ నిర్వహించి, జాబితా సరిచేయాల్సి ఉండగా, అధికారులు స్పందించక పోవటంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. బీఎల్‌ఓ రవికుమార్‌ను సస్పెన్షన్ చేశారు. ఇదే విషయమై గతంలో తహసీల్దార్‌గా పనిచేసిన సత్యనారాయణకు, సూపర్ వైజర్ ప్రేమ్‌కుమార్‌కు ఇప్పటికే షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి.